## క్లుప్తంగా

### కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఉన్న కన్నికలమ్మ గ్రామదేవతకు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా పూజలు చేశారు. అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. చెన్నై తాంబరానికి చెందిన వారు దేవతకు ప్రత్యేక పూజలు చేశారు.

### టపాకాయల దుకాణాల్లో తనిఖీలు

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేటలోని పర్మినెంట్ క్రాకర్స్ షాపుల్లో శుక్రవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ ధర్మారెడ్డి మాట్లాడుతూ దుకాణదారులు నిర్దేశిత ప్రాంతాల్లోనే షాపులు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్తికేయ, సునీల్ దుకాణాలను పరిశీలించారు. తనిఖీల్లో తహశీల్దార్ జరీనా, పుత్తూరు అగ్నిమాపక అధికారి గిరిధర్ పాల్గొన్నారు.

### కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నగరి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై చెప్పుతో దాడిని ఖండిస్తూ నగరి న్యాయవాదులు కోర్టు ఆవరణలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై దాడి అని వాపోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నగరి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేలాయుధం, కోశాధికారి నాగరాజన్, సెక్రటరీ జాన్ జోష్, జాయింట్ సెక్రటరీ తిరుమలై, ట్రెజరర్ అరుణ్, సభ్యులు ఈజీ బాబు, శేఖర్, రాము, మదన్, లోకేష్, నరేంద్ర కుమార్, మురళీకృష్ణ, ఎం.బాబు, మోహన్ పాల్గొన్నారు.

### ఇళ్లలోకి పాములు

కార్వేటినగరం: మండలంలో కురిసిన భారీ వర్షాలకు కాలువలు పొంగిపొర్లాయి. కత్తెరపల్లి ఏఏడబ్ల్యూ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కృష్ణాపురం నుంచి ఎద్దల చెరువుకు నీటిని సరఫరా చేసే సప్లై చానల్ ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లపై నీరు పొంగి పొర్లింది. దీంతో ఏఏడబ్ల్యూలోని రెండు ఇళ్లలోకి వరదనీరు చొరబడింది. ఆ నీటిలో ప్రమాదకరమైన పాములు కొట్టుకురావడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడానికి కారణం ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యమేనని వాపోయారు. కత్తెరపల్లి బీసీ వసతి గృహం వద్ద సప్లైచానల్‌పై కల్వర్టు నిర్మించడంతోనే ఇలాంటి ఘటన చోటు చేసుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కాలువలో రైతులు నిర్మించుకున్న గట్లను తొలగించి ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నిబంధనల మేరకే టపాసుల దుకాణాలు


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

కార్వేటినగరం: ప్రభుత్వ నిబంధనల మేరకే బాణాసంచా దుకాణాలు నిర్వహించాలని నగరి డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో బాణాసంచా దుకాణదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

# కంటబడితే.. కరిచేస్తున్నాయి



నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామంలో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మేకలు, కోళ్లతోపాటు వాహనదారులను వెంబడించి శునకాలు పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదనుంచి తమను రక్షించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

- పల్లెల్లో గ్రామ సింహాల బెడద
- చిన్నారులు, వృద్ధులు, మేకలు, కోళ్లపై దాడులు
- విచ్చలవిడిగా శునకాల సంచారం
- చర్యలు తీసుకోని అధికారులు


గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

పాలసముద్రం : కరిచిన ఏ కుక్క అయినా 14 రోజులపాటు లక్ష ణాలు పరిశీలించాలి. రేబిస్ వ్యాధి సోకిన కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఇంట్లో ఆహారం సరిగా తీసకోదు. తరచూ నోటి నుంచి చొంగ కారుస్తూ ఉంటుంది. అంతేగాకుండా రెండు కాళ్ల మధ్యలో తోక ముడుచుకుంటున్న దానిని బట్టి కూడా రేబిస్ సోకిన కుక్కలా గుర్తించవచ్చు.

**కుక్కకాటుపై చర్యలు**

కుక్క కరిచిన మరుక్షణం ట్యాప్ వాటర్‌తో డిటర్జెంట్ సోప్(బట్టలు ఉతికే సబ్బు)తో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ మరింతగా వ్యాపించే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోటు, విధానం, రేబిస్ కుక్క అయితే దానిని బట్టి ఐదు నుంచి ఏడు ఇంజక్షన్లు వేస్తారు. పిచ్చికుక్క (రేబిస్) కరిస్తే దానికి హీనోగ్లాబిన్ ఇంజక్షన్ వేయించుకోవాలి. ఇది ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉండదు. యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేసుకోకపోతే కరిచిన ప్రదేశాన్ని బట్టి తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం కూడా సోకుతుంది. నాలుక, గొంతు పనిచేయకుండా పోతుంది. అంతేకాకుండా ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. వ్యాధి సోకిన తరువాత నీరు చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు ఎలాంటి చికిత్సకు లొంగకుండా రేబిస్ వ్యాధి ప్రాణాంతకంగా మారుతుంది. అయితే పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**పిల్లలను వీధుల్లో వదిలేందుకు భయం**



ఆటలాడేందుకు పిల్లలను వీధుల్లో వదిలేందుకు భయమేస్తోంది. వీధి కుక్కలు ఎక్కడ కరుస్తాయోనని వదలడం లేదు. నెల రోజుల క్రితం మా పిల్లాడు పాఠశాలకు వెళ్లి, ఇంటికి వచ్చేటప్పుడు కుక్కలు తిరగబడి కరిచేశాయి. రక్తం కారుతూ ఇంటికి వచ్చాడు. పాలసముద్రం ఆస్పత్రికి వెళ్లి టీకాలు వేయించాను. – ఆర్.గౌతమి, కన్నికాపురం, దళితవాడ

**శ్రీకావేరిరాజుపురంలో వంద కుక్కలున్నాయి**



మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో వందకు పైగా కుక్కలు ఉన్నాయి. మా మనవరాళ్లను ఇంటి ముందు ఆడుకోవడానికి పంపించాలంటే భయంగా ఉంది. నన్ను రాత్రి వస్తున్న సమయంలో కాళ్లపై కొరికేసింది. పలుమార్లు అధికారులకు కుక్కల బెడద నుంచి కాపాడాని విన్నవించినా పెడచెవిన పెడుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అయినా స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి. – కె.రాజేంద్రన్, ఎస్‌కేఆర్ పురం

**నిర్లక్ష్యం చేయవద్దు**



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి. అది ఏం చేస్తుందిలే అనుకుంటే ప్రాణానికే ముప్పు. ఆ కుక్క పెంపుడు కుక్క అయినా, వీధి కుక్క అయినా ఆలస్యం చేయొద్దు. కనీసం ఐదు నుంచి 7 వరకు ఇంజక్షన్లు వేసుకోవాల్సిందే. నెలకు 10 నుంచి 20 మంది వరకు కుక్కకాటుకు గురై ఆస్పత్రికి వస్తున్నారు. ఆస్పత్రిలో వ్యాక్సిన్ కొరత లేదు. – డాక్టర్ మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి, పాలసముద్రం

**దూడలు, మేక పిల్లలను వెంటాడుతున్నాయి**



వీధి కుక్కల భయం ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుతున్నాయి. కాస్త దూడలను, మేక పిల్లలను బయట వదిలేందుకు భయంగా ఉంది. ఎప్పుడు దూడలు, మేక పిల్లలపై దాడులు చేస్తాయో తెలియ డం లేదు. రెండు రోజుల క్రితం కోడి పుంజుని తీసుకెళ్లిపోయాయి. – సెల్వి, సీఎం కండ్రిగ

**వీధిలోకి వెళ్లాలంటే భయం**



కూలీ పనులకు వెళ్లి కాస్త రాత్రి 8 గంటలకు వాహనాల్లో వచ్చేటప్పుడు కుక్కలు భయం తప్పడం లేదు. ఒంటరిగా గ్రామంలో వస్తుంటే కుక్కలు గుమిగూడి మనుషులపై దాడి చేస్తున్నాయి. భయంతో పరిగెత్తుకొంటూ పోతుంటే వెంటనే దాడి చేసి, కరిచేస్తున్నాయి. – పి.రాణి, పాలసముద్రం, గృహిణి

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు: పట్టణం, రూరల్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు జైసాయి, భాస్కర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కల్యాణపురం సబ్‌స్టేషన్లు, రూరల్ పరిధిలోని పైడిపల్లి, దిగువపుత్తూరు, పరమేశ్వరమంగళం సబ్‌స్టేషన్ల పరిధిలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

### మానసిక ఆరోగ్యంపై అవగాహన


మాట్లాడుతున్న హెల్త్ కౌన్సిలర్ షీలా

నింద్ర: ప్రపంచ మెంటల్ హెల్త్ డే పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ కౌన్సిలర్ షీలా మాట్లాడుతూ ఎమోషనల్ స్టెబిలిటీ, మెంటల్ హెల్త్ చక్కగా ఉంచుకోవాడానికి సూచనలిచ్చారు. యోగా, మెడిటేషన్ ప్రాముఖ్యతను ఆమె వివరించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడడం, అలవాట్లు అనుసరించడంతో మానసికంగా ఆరోగ్యంగా తయారవుతారని అన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వసుమతిదేవి, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### 16న జాబ్ మేళా

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్ సంయుక్తంగా ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 10 బహుళజాతి సంస్థలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 వరకు వయస్సున్న వారు అర్హులన్నారు. వివరాలకు రసూల్‌ను 63009 54441, లోకేష్‌ను 99635 61755 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పేదల ఆరోగ్య హక్కుల కోసం పోరాటం

- మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: పేద ప్రజల ఆరోగ్య హక్కుల కోసం పోరాడుదామని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీమంత్రి నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్ఆర్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీ హయాంలో తెచ్చిన 17మెడికల్ కాలేజీల పరిరక్షణకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 11వ తేదీ నుంచి నవంబర్ 22 వరకు 40 రోజులపాటు రచ్చబండ కార్యక్రమం పేరుతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించి, రాష్ట్ర గవర్నర్‌కి అందిస్తామన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు వైఎస్ఆర్ సీపీ హయాంలో ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలని నిర్ణయించారని, అదే జరిగితే పేదలకు ఖరీదైన వైద్యం అందదన్నారు. అలాగే మెడికల్ విద్యార్థులు సీట్లు నష్టపోతారన్నారు. రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే మెడికల్ కాలేజీలు నడుస్తాయని, అలా చేయకుండా ప్రైవేట్ పరం చేస్తే విద్యార్థులు నష్టపోతారన్నారు. అందుకే మెడికల్ కాలేజీల ప్రైవేకరణను వ్యతిరేకించి పోరాడాలన్నారు. అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 23న నియోజకవర్గాల నుండి కోటి సంతకాల పత్రాల సమర్పణ, నవంబర్ 24న పార్టీ కేంద్ర కార్యాలయానికి పత్రాల తరలింపు, డిసెంబర్ 6న కోటి సంతకాల పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పార్టీశ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పేద విద్యార్థుల పక్షాన నిలబడాలన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

కార్వేటినగరం: గత ప్రభుత్వంలో జగనన్న 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకు వస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేయడాన్ని అడ్డుకుందామని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని సురేంద్రపురం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల కోసం 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కేలాయించిందన్నారు. ఇప్పటికే 5 కళాశాలల్లో తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తు జీఓ విడుదల చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ కళాశాలను కాపాడుకోవాలంటే కోటి సంతకాలను సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించాలన్నారు. అనంతరం కోటి సంతకాల పోర్టర్‌ను ఆవిష్కరించారు. మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, సర్పంచ్ పెరియస్వామి రెడ్డి, వెదురుకుప్పం జెడ్పీటీసీ సుకుమార్, శ్రీరంగరాజపురం మండల కన్వీనర్ మణి, ఎంపీటీసీ సభ్యులు మోహనకుమారి, నాయకులు వెంకటరత్నం, మునికృష్ణ, శోభన్ బాబు, రాము, ధనశేఖర్, శివప్రకాష్, మున్నా, నాగరాజు, మురగయ్య, రత్నం, విజయ్‌కుమార్, ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై శిక్షణ

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు రైతు సేవా కేంద్రంలో రైతులందరికీ హక్కు సమాచార చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు పాల్గొని రైతులకు శిక్షణ అందించారు. రైతుసేవా కేంద్ర పరిధిలో ర్యాలీ నిర్వహించారు. డీపీఎంయూ నాంచారమ్మ, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**జీడీనెల్లూరులో..**

గంగాధరనెల్లూరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ముఖ్యమని ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ వాసు అన్నారు. మండలంలో వేల్కూరు సచివాలయం వద్ద శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లలితమ్మ, మాస్టర్ ట్రైనర్ రాజా, ఎస్‌డీఏ నాంచారమ్మ, హేమావతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మునిరెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి, నాయకులు

గంగాధరనెల్లూరు: మండలంలోని జీడీ నెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లి గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి తండ్రి మునిరెడ్డి(90) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మోతరంగనపల్లి గ్రామానికి చేరుకున్నారు. మునిరెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, ఆర్టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఢిల్లీ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి చంద్రగిరి కాలప్ప, సోషల్ మీడియా మదన్, దామోదరం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### నింద్ర ఎస్ఐగా మల్లికార్జున



నింద్ర: నింద్ర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా మల్లికార్జున శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో జిల్లాలోని జీడీనెల్లూరు, గుడిపాల మండలాల్లో పని చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విజయం సాధించడం ద్వారా దేశం గర్వపడేలా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఫస్టియర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. నిర్దేశించుకొనే ఉన్నతమైన లక్ష్యాలే జీవితాన్ని మలుపు తిప్పుతాయన్నారు. ప్రభుత్వాలు డిగ్రీ విద్యావ్యవస్థలో అనేక సౌకర్యాలను కల్పించాయన్నారు. అధ్యాపకులు సైతం విద్యార్థుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ నూతన సెమిస్టర్ పద్ధతి, పరీక్షల విధానం, పోటీ పరీక్షలు, జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్, స్త్రీ సాధికార సంస్థ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎకో క్లబ్, గ్రంథాలయం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర విభాగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు సుజన, మన్యం నరసింహులు, వాణిశ్రీ, హరిబాబు, శ్రీదేవి, వెంకటకృష్ణయ్య, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలు పట్టించుకోని కార్యదర్శి


ఇల్లత్తూరులో పాచిపట్టిన సిమెంట్ రోడ్డు

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు పంచాయతీ కార్యదర్శి సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పాచి పట్టి దుర్వాసన వస్తున్నాయని వాపోయారు. పారిశుధ్య పనులు చేసిన దాఖలాలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండ దోమలు దండయాత్ర చేస్తున్నాయని, రాత్రి పూట కంటిపై కనుకులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమకాటుతో చాలా మంది అనారోగ్యబారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ నిధులు, గ్రీన్ అంబాసిడర్ల జీతాల్లో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై మండల స్థాయి అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### వర్షకాలంలో జాగ్రత్తలు పాటించాలి

పుత్తూరు: వర్షకాలం రానుండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులకు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీదేవి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓలు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు హాజరైన ఎంఈఓలు, మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, సాంఘిక సంక్షేమ వార్డన్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు తగిన సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జాగ్రత్తలు తెలియజేశారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరి చేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజేరయ్య, ఎంఈఓ తిరుమలరాజు, మున్సిపల్ మేనేజర్ బాలాజీనాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమి స్వాధీనం


సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు పంచాయతీ నల్లరాళ్లపల్లి రెవెన్యూలో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న 17 ఎకరాల ప్రభుత్వ భూమిని తహశీల్దార్ సీకే శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఈ భూమిలో మండల సర్వేయర్ గణేష్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో తహశీల్దార్ శ్రీనివాసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల ప్రకారం అనాధీనంగా నమోదైంది. ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని తహశీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ ప్రభుత్వ భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టప్రకారం శిక్షార్హులవుతారని ఆయన తెలిపారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన వాహనదారులకు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ఉంచుకోవడం, వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# వర్ష విధ్వంసం


నీటి మునిగిన వేరుశనగ పంట చూపుతున్న రైతు


వనదుర్గాపురంలో వర్షపు నీటిలో మునిగిపోయిన వరి పంట


లోతట్టు వంతెనపై పారుతున్న నది నీరు


మహదేవమంగళం పాఠశాలలో వర్షపు నీరు


కోతకు గురైన కలిజవేడు వద్ద రోడ్డు

శ్రీరంగరాజపురం: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గురువారం రాత్రి మండల వ్యాప్తంగా 154.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్ష ప్రభావంతో తయ్యూరు పంచాయతీ గ్రామాల్లో వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయి. అలాగే గువ కమ్మకండ్రిగ పంచాయతీలో వడ్డికండ్రిగ, మిట్ట హరిజనవాడ, దిగువ కమ్మకండ్రిగ, పాతపాళ్యం గ్రామానికి చెందిన వాగు ఉధృతంగా పొంగడంతో దాదాపు 18 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం ప్రకటించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వాగులకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులను పెట్టారు.

**పొంగిపొర్లిన వాగులు**

పాలసముద్రం: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాగులు వంకలు, చెక్‌డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. మహదేవపురం, వెంగళరాజుకుప్పం, మఠవలం వంకల్లో వర్షపు నీటి ఉధృతి ఎక్కువ కావడంతో రోడ్డుపై రాకపోకలు స్తంభించాయి. రైతులు అష్టకష్టాలు పడి సాగు చేసిన వరి పంట కోత దశలో వర్షానికి నేలపాలైంది. వనదుర్గాపురంలో కోత దశలో ఉన్న వరి పొలాల్లో వర్షపు నీరు నిండిపోయింది.

**జోరు వర్షం**

గంగాధరనెల్లూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం అర్ధ రాత్రి భారీ ఉరుములు మెరుపులతో జోరున వర్షం కురిసింది. భారీ వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. మహదేవమంగళం పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహశీల్దార్ సీకే శ్రీనివాసులు పాఠశాలను శనివారం పరిశీలించారు. నీవానది పరివాహక ప్రాంతంలో కలిగివేడు కొత్రకోన చిత్తూరు రోడ్డు మార్గం పూర్తిగా కోతకు గురి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తూగుండ్రం కొత్త వెంకటపురం రోడ్డు, ఆత్మకూరు క్రాస్–నరసింగరాయన పేట రోడ్డులో నది నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో చుట్టు పక్కల గ్రామస్తులు అవస్థలు పడ్డారు.

**ఉప్పొంగిన కుశస్థలి**

నగరి: కుశస్థలి నదిలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు కృష్ణాపురం డ్యామ్ నిండడంతో గేట్లు తీశారు. దీంతో కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. కీళపట్టు లోతట్టు వంతెనపై నుంచి నీరు పెద్ద ఎత్తున పారుతుండడంతో ఆ వైపుగా రాకపోకలను నిషేధించారు. రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు వేసి ప్రయాణికులను మరో మార్గంలో వెళ్లే ఏర్పాట్లు చేపట్టారు.